

14న మంచిర్యాలకు డిప్యూటీ సీఎం రాక

మంచిర్యాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ నెల 14న మంచిర్యాలకు రానున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ప్రత్యేక చొరవతో నిర్మించతలపెట్టిన రాళ్లవాగు, గోదావరి కరకట్టల నిర్మాణం శంకుస్థాపన, మహా ప్రస్థానం ప్రారంభోత్సవం, ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహావిష్కరణను డిప్యూటీ సీఎం చేయనున్నట్లు తెలిపారు.

గ్యాస్, పెట్రోల్ ధరల పెంపుపై నిరసన

నస్పూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్, పెట్రోల్ ధరలను పెంచి సామాన్యులపై కేంద్ర ప్రభుత్వం భారం మోపుతుందని సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో శుక్రవారం నస్పూర్ పట్టణం సీసీసీ ప్రశాంత్ నగర్‌లో రోడ్డుపై సిలిండర్ పెట్టి నిరసన వ్యక్తం చేశారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ (ఎం) నాయకులు మిడివెల్లి రాజ్‌కుమార్, మనస్విని, అనూష, శ్రీలత, లక్ష్మి పాల్గొన్నారు.

నియామకం

లక్షెట్టిపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం ఆవోపా అధ్యక్షుడిగా కొత్త కిరణ్ కుమార్ నియమితులయ్యారు. పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం రాత్రి ఆవోపా జిల్లా రాష్ట్ర స్థాయి సభ్యులు ఏర్పాటు చేసిన ఎన్నికల సమావేశంలో కొంత కాలంగా కొత్త కిరణ్ కుమార్ వివిధ పదవుల్లో కొనసాగుతూ తాను చేసిన సేవలను గుర్తించి ఆవోపా జిల్లా అధ్యక్షుడు వొజ్జల రాజమౌళి సమక్షంలో సభ్యులు ఏకగ్రీవంగా అధ్యక్ష పదవిని అప్పగించడం జరిగింది. ఎన్నికైన కిరణ్ కుమార్‌ను తోటి సభ్యులతో పాటు ఆర్యవైశ్య సంఘ సభ్యులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభల అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు, ఆవోపా మాజీ అధ్యక్షుడు సుదర్శన్, సీనియర్ ఆవోపా నాయకులు భీమన్న, సభ్యులు పాల్గొన్నారు.

అడుగంటుతున్న ఎల్లంపల్లి

ప్రాజెక్టులో ఘననీయంగా తగ్గిన నీటి మట్టం

20టీఎంసీలకు ప్రస్తుతం 9 టీఎంసీల నీరు

సాగునీటి సరఫరా నిలిపివేసే యోచనలో అధికారులు

జాగ్రత్తలు తీసుకుంటేనే తాగునీటికి భరోసా

మరో రెండు నెలలు ఇదే పరిస్థితి

మంచిర్యాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట గ్రామంవద్ద గోదావరిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం ఘననీయంగా తగ్గుముఖం పడుతోంది. ఓ వైపు ఎండలు ముదరడం, మరోవైపు వివిధ పనుల నిమిత్తం నీటి కేటాయింపులతో ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి నిత్యం 597 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాల కోసం హైదరాబాద్ మెట్రో వర్క్ స్కీం (హెచ్‌ఎండబ్ల్యుఎస్)కోసం 331 క్యూసెక్కులు, రామగుండంలోని ఎన్టీపీసీ పంప్ హౌజ్‌కు 121 క్యూసెక్కులు, గూడెం పంప్ హౌజ్‌కు 181 క్యూ సెక్కులు, పెద్దపల్లి, రామగుండం మిషన్ భగీరథ పథకం కోసం 58 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మంచిర్యాల జిల్లా ప్రజల తాగునీటి అవసరాల కోసం 23 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. అలాగే ఎండల కారణంగా ఆవిరి రూపంలో 190 క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది. ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో వేమునూరు పంప్ హౌజ్, నంది పంప్‌హౌజ్‌లకు నీటి విడుదల నిలిపివేశారు.

ఈ నెల 15 నుంచి సాగునీరు నిలిపివేత..

ప్రాజెక్టులో నీటిమట్టం గణనీయంగా తగ్గుముఖం పడుతుండటంతో సంబంధిత అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 15 నుంచి సాగునీటి విడుదలను పూర్తిగా నిలిపివేయనున్నట్లు గూడెం పంప్‌హౌజ్ అధికారులు ప్రకటించారు. ఆ రోజు నుంచి పంప్‌హౌజ్ మోటార్లు నిలిపివేయనున్నట్లు..

మిగతా 7వ పేజీలో

ఉన్నవి 9 టీఎంసీలే...

ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి 9.03 టీఎంసీలకు పడిపోయింది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 7.23 టీ ఎంసీల నీరు అందుబాటులో ఉండగా, ఈ ఏడాది ఇప్పటి వరకు రెండు టీఎంసీల మేర నీరు అదనంగా ఉంది. ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ పంప్ హౌజ్‌కు నీరందించే ఇన్‌టెక్ వెల్ వద్ద కొద్ది రోజు లుగా నీరు పూర్తిగా తగ్గుముఖం పడుతోంది. గతేడాదితో పోలిస్తే ప్రాజెక్టులో నీటి మట్టం కొంతమేర ఆశాజనకంగా ఉండటంతో తాగునీటి అవసరా లకు ఢోకా లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీరు జూన్ వరకు తాగు నీటి అవసరాలు తీరుస్తుందని అంటున్నారు.





అభివృద్ధి పనులను సమర్థవంతంగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీబీ ముక్త్ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు పంచాయతీ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, 2025 సంవత్సరం పూర్తయ్యేలోగా క్షయ వ్యాధి రహిత గ్రామ పంచాయతీలుగా మార్చాలన్నారు. అలాగే పోషణ పక్షోత్సవాలను ఈ నెల 22 వరకు జరగనున్నాయని, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువు, ఎదుగులను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. రాజీవ్ యువ వికాసం పతకంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈనెల 30లోగా అర్హత గల వారిని గుర్తించాలన్నారు. అనంతరం గ్రామపంచాయ తీల వారీగా అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించాల న్నారు. ఈ కార్యక్రమంలో అధికా రులు వెంకటేశ్వర్ రావు, రాజేశ్వరి, పురుషోత్తం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్



కన్నెపల్లిలో తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కన్నెపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండలంలోని టేకులపల్లి గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రిజిష్టర్‌లను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నూతన మెను ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి హెల్ప్ డెస్క్ వద్ద రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర అధికారులు ఉన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

అదనపు కలెక్టర్ మోతీలాల్



జైపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

జైపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు తాలు తప్ప లేని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో యాసంగి వరిధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికోతల సమయంలో దగ్గరలోనే ఉంది కాబట్టి రైతులు పూర్తి పరిపక్వత చెంది గింజ, ఆకులు లేత పసుపు రంగుకు మారిన తర్వాతనే కోతలు చేపట్టాలన్నారు. రైతులు ధాన్యంతో పాటు పట్టాపాస్ బుక్, ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాపీలను ఇవ్వాలన్నారు. దొడ్డు వడ్లు గ్రేడ్ ఏ రకానికి రూ. 2320, గ్రేడ్ బీ ధాన్యంకు రూ.2300, క్వింటాలుకు మద్దతు ధరతో పాటు సన్నబియ్యంకు రూ. 500 బోనస్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. చెన్నూరు ఏడీఏ ప్రసాద్ నాయక్, తహసీల్దార్ వనజారెడ్డి, వ్యవసాయాధికారి మార్క్‌గ్లాడ్సన్, ఏపీఎం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల ఫోన్ నంబర్ల మార్పు

మంచిర్యాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ అధికారుల ఫోన్ నంబర్లు మారాయి. జిల్లా వ్యవసాయశాఖ అధికారి నంబరు 8977750735 కాగా, మంచిర్యాల, చెన్నూరు, భీమిని, బెల్లంపల్లి ఏడీఏ అధికారుల నంబర్లు 8977750778, 8977750760, 8977750749, 8977750745గా మారాయి. అలాగే వివిధ మండలాల ఏవోల నంబర్లు బెల్లంపల్లి 8977750746, కాసిపేట 8977750747, తాండూరు 8977750748, భీమిని 8977750756, కన్నెపల్లి 8977750757, నెన్నెల 8977750758, వేమనపల్లి 8977750759, భీమారం 8977750761, చెన్నూరు 8977750762, జైపూర్ 8977750763, కోటపల్లి 8977750764, మందమర్రి 8977760765, దండేపల్లి 8977750783, హాజీపూర్ 8977750781, జన్నారం 8977750782, లక్షెట్టిపేట 8977750783, మంచిర్యాల, నస్పూర్ 8977750784గా మారినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. రైతులు, ప్రజలు గమనించాలని కోరారు.

తేలనున్న లెక్క...

జిల్లాలో పశు గణన, 15తో ముగింపు...

నస్పూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన పశు గణన ఈ నెల 15తో ముగియనుంది. ఐదేళ్లకోసారి జాతీయ స్థాయిలో నిర్వహించే ఇంటింటి పశు గణన గతేడాది అక్టోబర్‌లో ప్రారంభమైంది. జిల్లాలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి పశువుల వివరాలను వివరాలు సేకరించి ఆన్‌లైన్ ప్రత్యేక యాప్ ద్వారా నిక్షిప్తం చేస్తున్నారు. పశుగణన సర్వే ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తి కావాల్సి ఉండగా వివిధ కారణాల వలన పూర్తి చేయకపోయారు. దీంతో ఏప్రిల్ 15వ తేది వరకు ప్రభుత్వం పొడిగించింది. ఇప్పటికే రాష్ట్రంలో పశుగణన పూర్తి చేసిన జిల్లాల జాబితాలో జిల్లా మూడవ స్థానానికి చేరుకుంది. జిల్లాలో 335 గ్రామాలు, 174 వార్డుల్లో ఎంపిక చేసిన 101 మంది ఎన్యూమరేటర్లు, ప్రత్యేకాధికారులు-27 మంది పశు గణనలో నిమగ్నమైయ్యారు. జిల్లాలో ఏడు గోశాలలు, డెయిరీ ఫామ్స్, కోళ్ల ఫామ్స్‌ల్లో వివరాలను సేకరించి నమోదు చేశారు.

రేణుక ఎల్లమ్మ విగ్రహావిష్కరణ



రేణుక ఎల్లమ్మ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న రఘునాథ్

నస్పూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సుందరయ్య కాలనీ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం వేద మంత్రోత్సవాల మధ్య ఘనంగా జరిగింది. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ పాల్గొని రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు గూళ్ల బాలాజి, తాగం సతీష్, జుమ్మిడి శిల్ప ధైగం స్వరూప, రజిత, సర్వేశం, రాజన్న, శంకర్, భీమయ్య, సంధ్య, పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

నెన్నెల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రక్తం దానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సిద్ధార్థ ఫౌండేషన్ చైర్మన్ దుర్గం సిద్ధార్థరామ్మూర్తి అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం గంగారం గ్రామంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో మాట్లాడారు. పరిసర గ్రామాలకు చెందిన 35 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులను అభినందించారు. మహర్ సేవా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి రాజ్‌కుమార్, నాయకులు గుమాస ఏసు, ప్రతాప్‌రెడ్డి, షాకిర్‌పాష, తోకల తిరుపతి, దేవేందర్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



మాదారం పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

తాండూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. శుక్రవారం మాదారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఎలాంటి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని సీఐ కుమారస్వామిని అడిగి తెలుసుకున్నారు. నకిలీ పత్తి విత్తనాల, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మావోయిస్టు ప్రభావిత గ్రామాలపై నిఘా ఉంచాలని, అసాంఘిక శక్తులకు తావివ్వవద్దని గ్రామస్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయాలన్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల పరిధిలో ఉన్న ప్రజలకు ఎలాంటి రవాణా అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. వాగులు, చెరువులు, ప్రాజెక్టులను ఆనుకుని ఉన్న ప్రజలకు అత్యవసర సమయంలో భారీ వర్షాలతో ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

శాశ్వత ఉద్యోగావకాశాలు కల్పించండి : హెచ్‌ఎంఎస్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో పనిచేస్తున్న భూ నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగావకాశాలు కల్పించాలని హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకుడు తిప్పారపు సారయ్య డిమాండ్ చేశారు. ఎస్టీపీపీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం సమావేశం శ్రీరాంపూర్ కార్యాలయంలో నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చేవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎస్టీపీపీలో 800 మెగావాట్ల విద్యుత్ యూనిట్‌కు శంకుస్థాపన చేసేదుకు వస్తున్నట్లు చెప్పారు. ఇటీవల యాదాద్రి పవర్ ప్లాంట్‌లో భూ నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. అదేమాదిరిగా ఎస్టీపీపీ భూ నిర్వాసి తులకు సైతం శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. అదేమాదిరిగా ఎస్టీపీపీ నిర్వహణను ప్రైవేటు సంస్థ నుంచి తప్పించి జెన్‌కో సంస్థకు అప్పగించాల న్నారు. ఆయా సమస్యలను సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి విక్రమ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సాయికృష్ణారెడ్డి, చిప్పకుర్తి సంపత్, హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి పొనగంటి అశోక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మడ్డి ఎల్లయ్యను ఏఐటీయూసీ నుంచి తొలగించాలి

మడ్డి ఎల్లయ్యను ఏఐటీయూసీ నుంచి తొలగించాలని హెచ్‌ఎంఎస్ కేం ద్ర కమిటీ నాయకుడు తిప్పారపు సారయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. వచ్చే నెల 20వ తేదీన నిర్వహించే ఒక్క రోజు సమ్మె విషయంలో మాట్లాడేందుకు వెళ్లిన హెచ్‌ఎంఎస్ ఆర్‌జీ-1 బ్రాంచ్ కార్యదర్శి పల్లె క్రాంతి కుమార్‌ను అసభ్యపదజాలంతో దూషించిన ఎల్లయ్యపై ఆ యూనియన్ నాయకులు చర్యలు చేపట్టాలన్నారు.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోండి

ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి దుర్గాప్రసాద్

దండేపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జిల్లా అధికారి, మండల ప్రత్యేకాధికారి దుర్గప్రసాద్ సూచించారు. శుక్రవారం దండేపల్లి మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారుల సేవా కేంద్రాన్ని ఆయన సందర్శించి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమీ క్ష సమావేశం నిర్వహించారు. రేషన్‌కార్డు ఉన్న వారు ఆదాయం సర్టిఫికెట్ సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. అధికారులు గ్రా మాలను సందర్శించి ప్రజల సమస్యలను ఎప్పటిక ప్పుడు తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలన్నారు.

రూ. 50వేల లోపు రుణానికి వందశాతం, రూ లక్షలోపు రుణానికి 90శాతం రాయితీ, పదిశాతం బ్యాంకు రుణం, లక్ష నుంచి 2 లక్షలలోపు రుణానికి 80 శాతం రాయితీ, 20 శాతం బ్యాంకు రుణం, ఆదేవిధంగా 2లక్షల నుంచి 4లక్షల రుణానికి 70 శాతం రాయితీ 30శాతం బ్యాంకు ద్వారా రుణం అందిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ ద్వారా చేసి ఆ దరఖాస్తు, డాక్యుమెంట్లతో ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. తహసీల్దార్ సంధ్య రాణి, ఎంపీడీవో ప్రసాద్ పాల్గొన్నారు.




సిబ్బందికి సూచనలు ఇస్తున్న ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్

శాంతిభద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షనలో విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలని రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝూ అన్నారు. శుక్రవారం టూటౌన్ పోలీసు స్టేష న్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పోలీసు స్టేషన్‌లో పెండింగ్ కేసులు ఎన్ని ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు దారుల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ప్రజలు సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరించినప్పుడు సమస్యలు తలెత్తకుండా ఉంటాయని చెప్పారు. నేరాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నేరం చేసిన వారికి శిక్ష పడాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రవికుమార్, సీఐలు అబ్జలోద్దీన్, కుమారస్వామి, ఎస్ఐ మహేందర్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రాళ్లవాగుకు చెందిన కోట దినేష్ నాగేందర్ వద్ద 170 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు సీఐ ప్రమోదర్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎస్ఐ వినీత, కానిస్టేబుల్ తిరుపతి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానితున్ని విచారించగా అతని వద్ద 170 గ్రాముల ఎండు గంజాయి స్వాధీన పరుచుకున్నారు. అలాగే చున్నంబట్టి వాడలో వందఫీట్ల రోడ్డు వద్ద మరొకరి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కాగా రెండు గంజాయి కేసుల్లో నేరస్తులను చాకచక్యంగా పట్టుకున్నందుకు సీఐ ప్రమోద్‌రావును, క్రైం పార్టీ సిబ్బందిని డీసీపీ భాస్కర్ క్యాష్ రివార్డుతో సత్కరించారు.



అందుబాటులోకి ఎల్‌సీ యాప్

● విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యం ● లైన్‌క్లియర్ అనుమతి నుంచి రిటర్న్ వరకు యాప్ ద్వారా సమాచారం

వాంకిడి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కరెంట్ సరఫరా కోసం చేపట్టే మరమ్మతుల సమయంలో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు ఎన్పీడీసీఎల్ మరో యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆన్‌లైన్ ఎల్‌సీ(లైన్‌క్లియర్) యాప్‌ను ప్రవేశపెట్టింది. ఎల్‌సీలు తీసుకుని పని చేసే సమయంలో మానవ తప్పిదాలు జరుగుతున్న నేపథ్యంలో నూతనంగా తీసుకొచ్చిన యాప్ అటు వినియోగదారులకు, ఇటు ఎన్పీడీసీఎల్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. విద్యుత్ సరఫరాలో భద్రతా ప్రమాణాలను పెంచేందుకు, విద్యుత్ అంతరాయ సమయాలు, మానవ తప్పిదాలను నివారించేందుకు లైన్ క్లియర్ (ఎల్‌సీ) యాప్‌ను రూపొందించినట్లు ఎన్‌సీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు.


అమలు విధానం..

విద్యుత్ సరఫరాలో ఎల్‌సీ తీసుకోవాలనుకున్న లైన్‌మన్ మొదటగా లైన్ క్లియర్ యాప్ ఓపెన్ చేయాలి. సంబంధిత ఫీడర్‌లో ఎల్‌సీ కావాలని ఏఈకి విన్నవించాలి. ఏఈ లైన్‌మెన్ విన్నపాన్ని పరిశీలించి ఆ ఫీడర్‌లో ఎల్‌సీ ఇవ్వొచ్చా.. లేదా అని అత్యవసర అవసరాలు ఏమైనా ఉన్నాయా లేదా మరే ఇతర షెడ్యూల్ చేసిన పనులు ఉన్నాయా అని సమీక్షించుకుంటారు. దాని ప్రకారం ఏఈఎల్‌సీ ఇవ్వొచ్చు లేదా నిరాకరించవచ్చు. ఏఈ ఎల్‌సీకి అనుమతి ఇవ్వగానే సంబంధిత లైన్‌మన్‌కు సమాచారం అందుతుంది. అలాగే సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఏ ఫీడర్ ఇవ్వాలో యాప్ ద్వారా తెలుస్తోంది. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఎల్‌సీ ఇవ్వాల్సిన సమయంలో పొరపాట్లు లేకుండా తగిన సూచనలు, జాగ్రత్తలు హెల్మెట్ పెట్టుకోవడం, హ్యాండ్ గ్లౌజ్ వేసుకోవడం, ఎర్త్ రాడ్ వేయాలని, ఏబీ స్విచ్ ఓపెన్ చేస్తారా లేదా అని యాప్ గుర్తు చేస్తుంది. వీటన్నింటిని సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఫోటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే ఆ ఫోటోను యాప్ ద్వారా లైన్‌మెన్ చూసి ఆ ఫోటోలో కనిపిస్తున్న ఫీడర్, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా లేదా అని ధ్రువీకరించుకుని పనికి ఉపక్రమిస్తారు. లైన్‌మన్ ఎంతమంది సిబ్బందితో పని చేయిస్తున్నాడో వారి పేర్లు యాప్‌లో పొందుపర్చాలి.

లైన్‌మన్ పని పూర్తి కాగానే ఈ పనికి సంబంధించి ఫోటో సిబ్బంది వచ్చారా.. లేదా అని యాప్‌లో పొందుపర్చి ఎల్‌సీని రిటర్న్ చేస్తారు. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు యాప్ ద్వారా ఎల్‌సీ రిటర్న్ చేయాలని ఆదేశాలు వెళ్తాయి. రిటర్న్ చేసిన ఎల్‌సీ సమాచారం ఏఈకి అందుతుంది. ఏఈ ఆదేశాల మెరకు ఆ ఫిడర్‌లో విద్యుత్ సరఫరాను పునరుద్దరిస్తారు.

ఒక ఫీడర్ బదులు..

విద్యుత్ లైన్ క్లియర్‌లో ఒక ఫీడర్ బదులు మరో ఫీడర్‌ను ఎంచుకోవడం, పంపిణీ వ్యవస్థ సరిగ్గా గుర్తు చేసుకోకపోవడం, సమాచార లోపం, తదితర కారణాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఉద్యోగులు, కింది స్థాయి సిబ్బంది, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటి నివారణ కోసం ఆన్‌లైన్ ఎల్‌సీ యాప్ ను అందుబాటులోకి తీసుకొచ్చారు. యాప్ ద్వారా మానవ తప్పిదాలను పూర్తిగా నివారించవచ్చు. అనవసరమైన ఎల్‌సీలు తగ్గించవచ్చు. ఎల్‌సీల సమయాలను గణనీయంగా తగ్గించుకునే అవకాశం ఉంది. ఎల్‌సీ తీసుకున్న సమాచారం ఉన్నతాధికారులకు వెంటనే తెలిసిపోతుంది. సంబంధిత ఏఈ అనుమతి లేకుండా తీసుకునే ఎల్‌సీలను ఈ యాప్ ద్వారా నివారించవచ్చని చెబుతున్నారు.



పెండింగ్ పనుల పూర్తికి చర్యలు

వాసాల ప్రభాకర్, ఎంఈవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ఆదర్శ పాఠశాలలో అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఎంఈవో: ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు దాదాపు 90 శాతం పూర్తి అయ్యాయి. పెండింగ్ పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించాం. పనులు త్వరితగతిన పూర్తి చేస్తే ఆదర్శ పాఠశాలలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తాయి.

ఆంధ్రజ్యోతి: మన ఊరి-మనబడి పనులు బిల్లులు విడుదలయ్యాయా?

ఎంఈవో: మన ఊరి మన బడి పనులు 2023లో పూర్తి చేశారు. ఈ బిల్లులకు సంబం.ధించిన నివేదికలను ఉన్నతాధికారులకు పంపించాం. బిల్లులు రాగానే చెల్లిస్తాం.

ఆంధ్రజ్యోతి: వేసవి కాలంలో విద్యార్థులకు ఎలాంటి శిక్షణ అందిస్తున్నారు?

ఎంఈవో: పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు వేసవిలో శిక్షణ ఇస్తున్నాం. ఈ శిక్షణ స్థానిక డీఆర్సీలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతోంది. గతంలో కూడా శిక్షణ తీసుకున్న విద్యార్థులు పలువురు పోటీ పరీక్షలో మంచి ర్యాంకులు సాధించారు.

ఆంధ్రజ్యోతి: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంఈవో: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్లకు విద్యార్థులను వేధిస్తే యాజమా న్యాలపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. విద్యార్థులను వేధింపులకు గురి చేయొద్దని వారికి సూచిస్తున్నాం.

- కాగజ్‌నగర్ టౌన్, ఆంధ్రజ్యోతి

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పదోన్నతి పొందిన పోలీసులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పదోన్నతితో ఉత్సాహంతో పాటు మరింత బాధ్య త పెరుగుతుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొంది కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ అయిన సీహెచ్ శ్రీనివాస్, ఎన్‌బాలాజీ, సీహెచ్ సతీష్, ఎస్ సమయ్య, కె రాజేందర్, సీహెచ్ సతీష్‌లు శుక్రవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో పదోన్నతి ఎంతో ఉత్సాహానిస్తుందని చెప్పారు. దాంతో పాటు బాధ్యతను కూడా పెంచుతుందని అన్నారు. విధి నిర్వహణలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రజలకు మంచి సేవలు అందించాలని ఎస్పీ సూచించారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, భక్తులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని భక్తులు శుక్రవారం శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీర హనుమాన్ ఆలయం నుంచి హనుమాన్ దీక్ష స్వాములు, భజరంగ్ దళ్, హిందు ఉత్సవ సమితి సభ్యులు ఏర్పాటు చేసిన శోభాయాత్రను బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు ప్రారంభించారు. జై శ్రీరామ్.. జై హనుమాన్ నినాదాలతో, భక్తీ గీతాలతో యువకులు నృత్యాలతో పలు వీధుల మీదుగా కొనసాగింది. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకురాలు సరస్వతి, బీజేపీ నాయకుడు సతీష్‌బాబు పాల్గొని భక్తులతో కలిసి నృత్యం చేశారు. మాలధారులకు అరిగెల నాగేశ్వర్‌రావుతో పాటు స్వచ్ఛంద సంస్థలు పండ్లు, అల్పాహారాన్ని చల్లటి తాగునీటిని ఏర్పాటు చేశారు. బజార్‌వాడీ హనుమాన్ ఆలయం వద్ద భక్తులు, స్థానిక ప్రజలకు అన్నదానం చేశారు.

గుండెపోటుతో సీనియర్ పాత్రికేయుడు మృతి

నెన్నెల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు రేణికుంట్ల వెంకటేశ్వర్ (51) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు బెల్లంపల్లికి తరలిస్తుండగానే మృతి చెందాడు. వివిధ ప్రధాన పత్రికల్లో రిపోర్టర్‌గా పని చేసిన వెంకటేశ్వర్‌కు ప్రజల కోసం పోరాడే వ్యక్తిగా మంచి పేరుంది. ఆయనకు భార్య మాధవి, కొడుకు అంజనికుమార్ ఉన్నారు. మండల అధికారులు, నాయకులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం ప్రకటించారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

కోటపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం తాటిచెట్టుపై నుంచి కింద పడి గీత కార్మికులు తాళ్లపల్లి రాకేష్‌గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వేమనపల్లి మండలం దస్నాపూర్ గ్రామానికి చెందిన రాకేష్‌గౌడ్ కోటపల్లిలో తాటి చెట్లను కౌలుకు తీసుకుని వృత్తి నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో చెట్టుపై నుంచి కల్లు కుండలు తీసుకువస్తుండగా కాళ్లకు ఉన్న తాడు జారిపోవడంతో హఠాత్తుగా రోడ్డుపై కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో చెన్నూరు ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు మంచిర్యాల ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు స్థానికులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం సంఘ మిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యానారాయణ తెలిపారు. శరీరం మొత్తం గుర్తు పట్టని విధంగా ఉందని 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నామని, వివరాలకు 9618689879 కు సంప్రదించాలని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బెల్లంపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకెనపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తాళ్లగురిజాల రమేశ్ శుక్రవారం తెలి పారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి చేనులోని చెట్టుకు ఉరివేసుకొని ఉన్నట్లు తెలి పారు. మృతుడి శరీరంపై బ్లూకలర్ పాయింట్, బనియన్ ఉందని చెప్పారు. వివరాలు తెలిసిన వారు 8712656561 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భీమిని, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగుడిపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు భీమిని ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి రూ. 6,700 నగదు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో పేకాడుతున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు. దాడిలో కానిస్టేబుళ్లు కృష్ణారెడ్డి, వినోద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

వాంకిడి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకంలో యూనిట్ల ఏర్పాటుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం సహాయ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన దరఖాస్తుదారులతో మాట్లాడారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ పథకంలో ఉన్న యూనిట్‌లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ప్రతిని ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ నెల 14 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు. నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. కులాల వారీగా ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను రిజిస్ట్రేష న్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో ఇచ్చిన దరఖాస్తుకు ఆన్‌లైన్ అయ్యే విధంగా చూడాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌కు సూ చించారు. ఆదాయం సర్టిఫికెట్లు అభ్యర్థులకు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రియాజ్ అలీని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.



సహాయ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

అక్రమంగా పట్టాపాసుబుక్కులు సృష్టించిన నలుగురిపై కేసు నమోదు

కాసిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి శివారులో అక్రమంగా పట్టాలు సృష్టించిన నలుగురిపై బెల్లంపల్లి ఆర్డీవో హరిక్రిష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి శివారులోని సర్వే నంబర్ 2 2, 2-45, 2-49, 2-15 లలో పది ఎకరాల 18గుంటల భూమిని సోమగూడెం లంబడితండాకు చెందిన భానోత్ ఈశ్వరి అజ్మర జమున, అజ్మర రాజిలి, కురుసోత్ మోతీలు అక్రమంగా పట్టా చేసుకొని పట్టా పాసుబుక్కులు సృష్టించేందుకు ప్రయత్నించారు. ఈ ఊర్లను కళ్యాణఖని గని మెగా ఓసీపీలో భూమి ముంపునకు గురవుతుందని అక్రమ పట్టాలు సృష్టిం చారు. గుర్తించిన బెల్లంపల్లి ఆర్డీవో హరిక్రిష్ణ కాసిపేట పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కాసిపేట ఎస్ఐ తెలిపారు.

16న నిరుపయోగంగా ఉన్న సామగ్రి వేలం

ఆసిఫాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని స్పెషల్ సబ్ జైలులో నిరుపయోగంగా ఉన్న పాత ఇనుప, స్టీల్, సివిల్ స్టోర్ సామగ్రిని ఈ నెల 16న జైలు ఆవరణలో వేలం వేయనున్నామని జైలు పర్యవేక్షణాధికారి ప్రేంకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.500 డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

సమాజ మార్గదర్శకుడు జ్యోతిబాపూలే





శ్రీరాంపూర్‌లో జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సమాజ మార్గదర్శకుడు జ్యోతిబాపూలే అని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. జ్యోతిబాపూలే జయంతిని పురస్కరిం చుకుని శుక్రవారం జీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జీఎం ఆధ్వర్యంలో పూలమాల వేసి మాట్లాడారు. పూలే చేసిన సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, విద్య కోసం ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ లైజన్ అధికారి, ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏరియా ఉపాధ్యక్షుడు జి. శ్రీనివాస్, బ్రాంచ్ కార్యదర్శి బరపటి మారుతి, బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఆర్‌కే-6 గనిపై బీసీ లైజన్ అధికారి, ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, గని మేనేజర్ తిరుపతి పాల్గొని కేక్ కట్ చేశారు. ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, పిట్ కార్యదర్శి సంఘం సదానందం, తదితరులు పాల్గొన్నారు. ఆర్‌కే-7 గనిపై ఏజెంట్ రాజేందర్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. గని మేనేజర్ తిరుపతి, ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, రక్షణాధికారి సంతోష్ రావు, సంక్షేమాధికారి సంతన్, తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం(140/2018) ఏరియా ఉపాధ్యక్షుడు దేగల ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆర్‌కే-8 డిస్పెన్సరీలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీఎం ఎం. శ్రీనివాస్ హాజరయ్యారు. జీఎం కార్యాలయం ఆవరణలో జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని, ప్రగతి స్టేడియంకు పూలే మైదానంగా నామకరణం చేయాలని జీఎంకు వినతిప త్రం ఇచ్చారు ఎస్సీ లైజన్ అధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్ల వద్ద శుక్రవారం మహాత్మాజ్యోతిబాపూలే జయంతి వేడుకలను కార్మిక సంఘాల నాయ కులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. కేకే 5 గని వద్ద గని మేనేజర్ శంభునాథ్ పాండే పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గాండ్ల సంపత్, కంది శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ నాయకులు నరేందర్, సంక్షేమాధికారి కార్తీక్, రవళి, రక్షనాధికారి రవికుమార్ పాల్గొన్నారు. ఏరియా వర్క్‌షాపులో గుర్తింపు సంఘం నాయకులు బీమనాధుని సుదర్శ న్, వెంకటేశ్వర్లు, రాజేశ్వర్‌రావు, శర్మ తదితరులు పూలు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

రెబ్బెన,(ఆంధ్రజ్యోతి): గోలేటి సీఎస్పీలో సింగరేణి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం విజయభాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా ఎస్‌బీసీఏ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు జ్యోతిబాపూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిం చారు. కార్యక్రమంలో బీసీ లైసెన్ అధికారి డాక్టర్ ఎం.మధు కుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్‌సెక్రటరీ బయ్య మొగిలితో పాటు తదితరులు పాల్గొన్నారు. జీఎం కార్యాలయంలో జీఎం విజయభాస్కర్‌రెడ్డి జ్యోతిబా పూలే చిత్రపటం వద్ద నివాళులు అ ర్పించారు. కార్యక్రమంలో ఏరియా బీసీ లైసన్ అధికారి మధూకర్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, సీఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు మచ్చగిరి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): కాసిపేట గనిపై మేనేజర్ భూ శంకరయ్య, కాసిపేట 2గనిపై మేనేజర్‌లక్ష్మీనారాయణ, దేవాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగాం మల్లేశ్, కాసిపేట 2వ గని ఫిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, మీనుగు లక్ష్మీనారాయణ, ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ప్రచార కార్యదర్శి బన్న లక్ష్మణ్‌దాసు, కాంగ్రెస్ నాయకుడు మేరుగు శంకర్, గడ్డం పురుషోత్తం పాల్గొన్నారు.



రెబ్బెనలో నివాళులు అర్పిస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి



కాసిపేటలో నివాళులు అర్పిస్తున్న గని మేనేజర్ భూ శంకరయ్య

రెండు బోర్‌మోటార్ల ఏర్పాటు

వేమనపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బద్దంపల్లి గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు రెండు బోర్‌వెల్స్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో నీటి సమస్య ఉందని గ్రామస్తులు మండల కాంగ్రెస్ నాయకులు సంతోష్‌కుమార్, సాబీర్ అలీ, కోరెకొప్పుల రమేష్‌గౌడ్‌ల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన నాయకులు ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 4 లక్షలతో బద్దంపల్లి గ్రామంలో రెండు చోట్ల బోర్లు వేయించి వాటికి విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేయడంతో నీటి సమస్య తీరింది. గ్రామస్తులు ఎమ్మెల్యేకు, కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాసిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఫీడర్ మరమ్మత్తులు ఉన్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎన్‌పీడీసీఎల్ ఏఈ స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు. కొండాపూర్ 33 కేవీ సబ్ స్టేషన్‌లో తమరమ్మత్తులు చేపడుతున్నాం. ఇందులో భాగంగా శనివారం ఉదయం 9.30గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

భీమారం : సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుం దని విద్యుత్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌పరిధిలోని గ్రామాలకు విద్యుత్ ఉండదని తెలిపారు.

పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలి



పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కన్నెపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాజ్యోతిబా పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శుక్రవారం కన్నెపల్లి మండలంలోని జజ్జరవెల్లి గ్రామంలో పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి అని స్వాతంత్ర్యానికి ముందే మానవ హక్కులు, అంటరానితనంపై దంపతులు పోరాడారని పేర్కొన్నారు. మాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షిండె సత్యనారాయణ, ఆసిఫాబాద్ మాజీ సర్పంచు మర్సకోల సరస్వతి, పీఏసీఎస్ శాఖ సంఘం చైర్మన్ అహ్మద్ పాల్గొన్నారు.

భూసార నీటి సంరక్షణకు

వాటర్‌షెడ్‌తో పటిష్ట చర్యలు



గురువాపూర్‌లో నిర్మించిన నీటికుంట

జైపూర్, కాసిపేట మండలాల్లో రూ. 6 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు

వ్యవసాయ ఆధారిత జీవనోపాధిపై ప్రత్యేక శ్రద్ధ

ఆసక్తి చూపుతున్న రైతులు



దేవాపూర్‌లో నిర్మించిన కమ్యూనిటీ హాల్

కాసిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : క్రమక్రమంగా వాతావరణంలో వస్తున్న పెనుమార్పుల వల్ల సకాలంలో వర్షాలు కురవడం లేదు. వర్షాధార ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయి వ్యవసాయం రైతుకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో భూసార, నీటి సంరక్షణకు వర్షం నీటిని వినియోగించుకోవడం, పశుగ్రాసం, పచ్చదనం, అభివృద్ధి పర్చి భూమిలేని నిరుపేదలకు జీవనోపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు సమగ్ర నీటి పరివాహక కార్యక్రమాలు (వాటర్‌షెడ్)ను రైతులను అందుబాటులోకి తెచ్చారు. ఈ పథకాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

జిల్లాలో రెండు మండలాలు ఎంపిక

వాగులు, వంకల ద్వారా పోతున్న వర్షం నీటికి అడ్డుకట్ట వేసి నీటి నిల్వ భూగర్భ జలాల గరిష్ట స్థాయిని పెంచేందుకు చేపడుతున్న వాటర్ షెడ్ పథకం జిల్లాలో సత్ఫలితాలను ఇస్తోంది. ఐదేళ్ల ప్రాజెక్టులో భాగంగా 2021 డిసెంబరులో జైపూర్, కాసిపేట మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ముఖ్యంగా ఈ పథకం ద్వారా ప్రవేశిక కార్యక్రమాలను, వాటర్ షెడ్ ప్రణాళిక తయారీ, శిక్షణ కార్యక్రమాలు, సహజ వనరుల యాజమాన్యం, ఉత్పాదకత పెంపుదలతో పాటు జీవనోపాధి పెంపుదలపై ఈ పథకం సమర్థవంతంగా పనిచేస్తుంది. కాసిపేట, జైపూర్ మండలాల్లో ఎంపిక చేయగా కాసిపేట మండలంలోని సల్పలవాగు సోనాపూర్ అడవుల్లో ప్రారంభమై గట్రావుపల్లి, దేవాపూర్, చింతగూడెం, గురువాపూర్‌ల గుండా ప్రవహిస్తుంది. ఈ వాగుపై వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో పలు రాళ్ల కట్టలు, చెక్ డ్యాంలను నిర్మించి నీటిని నిల్వ చేశారు. పూర్తిస్థాయిలో పారుతున్న నీటిని నిల్వ చేసి 4900 హెక్టార్ల భూమిని సారవంతం చేసి సాగులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

అలాగే జైపూ ర్ మండలంలో ప్రవహించే మిట్టపల్లి వాగు ముదిగుంట, నర్వ, కాన్కూర్, ఇందారం మీదుగా టేకుమట్లకు చేరుకుంటుంది. మిట్టపల్లి వాగు పై చిన్న చిన్న ఆనకట్టలు నిర్మించి నీటిని నియంత్రిం చేందుకు కుంటల ను నిర్మిస్తున్నారు. జైపూర్‌లో 4940 హెక్టార్ల భూమిని సారవంతంగా చేసి సాగులోకి తెచ్చేందుకు వాటర్ షెడ్ అధికారులు పనులు చేస్తున్నారు. జలాలను సంరక్షించేందుకు ఇటీవల బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. పథకాలు సత్ఫలితాలు ఇవ్వడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పథకం ముఖ్య ఉద్దేశ్యం..

ఎత్తైన ప్రదేశాల్లో పడిన వర్షం నీరు చిన్న చిన్న వంకలు తిరుగుతూ వాగులుగా ఏర్పడి పల్లపు ప్రాంతానికి ప్రవహించి పెద్దవాగు లేదా కాలువ ద్వారా బయటకు పోయి నీరు వృథా అవుతుంది. పారే నీటికి అడ్డుకట్ట వేసి నీటిని నిల్వ చేయడమే వాటర్ షెడ్ పథకం ముఖ్య ఉద్దేశ్యం.

- నేల, నీరు, వృక్ష సంపదలను సక్రమంగా వినియోగించడం.
- పేదల వ్యక్తిగత భూములు, పశువులు, పండ్ల తోటలు, చేపల పెంపకం వంటి వాటిలో ఉత్పాదకత పెంపొందించడం.
- పేదల ప్రస్తుత జీవనోపాధులను మెరుగు పర్చు కోవడం. కొత్తగా జీవనోపాధి అవకాశాలను కల్పించి సామాజిక ఆర్థిక స్థితిగతులను మెరుగు పర్చడం. పనులు, ఆస్తుల నిర్వ హణ మరమ్మతులకు ప్రజలే పూర్తి బాధ్యత వహించేలా ప్రోత్సహించడం.
- స్థానిక సంప్రదాయ విజ్ఞానాన్ని ప్రోత్సహించడం.
- వాటర్ షెడ్ ప్రవేశిక కార్యక్రమాల్లో భాగంగా అందరికీ ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ షెడ్లు, బస్ షెల్టర్ లాంటివి నిర్మించడం.
- వాటర్‌షెడ్ నిధుల నుంచి 15 శాతం నిధులు కేటాయించి రైతులకు 75 శాతం రాయితీతో వ్యవసాయ పనిముట్లు అందజేయడం. గిరిజన మహిళ సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వడం.

చెక్ డ్యాంల కింద భూములు కబ్జాకు గురి కాకుండా చూడాలి



పారుతున్న వాగులపై నిర్మిస్తున్న నీటికుంటల కింద ఉన్న భూములు కబ్జాకు గురవుతున్నాయి. ప్రభుత్వం వీటిని సంరక్షించి భూమిలేని పేదలకు పంపిణీ చేయాలి. భూములను వాటర్ షెడ్ ఆధీనంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. వాటర్ షెడ్ పథకానికి మరిన్ని ప్రత్యేక నిధులు కేటాయించి పనులను జిల్లా వ్యాప్తంగా విస్తరించాలి.

మేరుగు శంకర్, వాటర్ షెడ్ కమిటీ సభ్యుడు, దేవాపూర్

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వాటర్ షెడ్ ద్వారా అమలు చేస్తున్న పథకాలను అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలి. అలాగే వర్షం నీటి కోత వలన భూమి స్వభావాన్ని బట్టి వివిధ రకాలైన వంకలు ఏర్పడుతాయి. నీటి కోతను నివారించకపోతే వంకలు వెడల్పు అయి భూమి లోతు ఎక్కువ అవుతుంది. దీంతో రైతులకు భూమి విస్తీర్ణం తగ్గుతుంది. అంతేకాకుండా సారవంతమైన మట్టి కొట్టుకుపోయి భూమి ఉత్పాదకత తగ్గుతుంది. కాబట్టి రైతులు భూమి కోతలను నివారించుకునేందుకు రాతి కట్టడాలను, చెక్ డ్యాంలను నిర్మించుకోవాలి.

శ్రీనివాస్, వాటర్ షెడ్ ప్రాజెక్టు ఆఫీసర్, మంచిర్యాల

యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా మెరుగైన జీవనోపాధి



వాటర్ షెడ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలను చైత న్యపర్చి నీటి సంరక్షణ, నేల సంరక్షణపై అవగాహన కార్య క్రమాలను నిర్వహిస్తారు. అలాగే గ్రామాల్లోని యు వతకు నైపుణ్య శిక్షణ ద్వారా మెరుగైన అవకాశాలు కల్పిస్తాం. వాటర్ షెడ్ ద్వారా భూగర్భ జలాల పెరుగుదలతో సాగునీరు సమృద్ధిగా లభిస్తుంది. అలాగే సాగు విస్తీర్ణం పెరుగుతుంది. వృక్ష సంపద, పచ్చదనం పెరుగుతుంది. వాతావరణ సమతుల్యత వల్ల సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయి. యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా మెరుగైన జీవనోపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

కిషన్, డీఆర్‌డీవో, మంచిర్యాల

అడుగంటుతున్న ఎల్లంపల్లి..

(5వ పేజీ తరువాయి)

ముందస్తుగా రైతులుకు సమాచారం ఇచ్చారు. రైతులు వ్యవసాయ కార్యక్రమాలు అందుకు అనుగుణంగా చేపట్టాని సూచించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి దండేపల్లి, లక్సెట్టిపే ట, హాజీపూర్ మండలాల్లో యాసంగి సాగునీటి అవసరాల కోసం ప్రస్తుతం 181 క్యూసెక్కుల నీటిని ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వినియోగిస్తున్నారు. యాసంగి సాగు కూడా చివరి దశకు చేరుకున్నందున నీటివిడుదల నిలిపివేయాలనే నిర్ణయానికి వచ్చారు. కాగా ఈ నెల చివరి వరకు నీరు ఇస్తే పంట చేతిక వస్తుందని రైతులు మొర పెట్టుకుంటున్నారు. కనీసం 22వ తేదీ వరకైనా నీరు ఇవ్వాలని, లేనిపక్షంలో వడ్లు గట్టిపడక, తాలుగా మారిపోయే ప్రమాదం ఉంటుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులు కోరినట్లు ఇస్తే తాగునీటి అవసరాల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందనే భావనలో అధికారులు ఉన్నారు.

రెండు నెలలు గడ్డు పరిస్థితే...

ఎల్లంపల్లి ప్రాజెక్టులో రోజు రోజుకూ నీటి మట్టం పడిపోతుండటం, వివిధ అవసరాలకు పెద్దమొత్తంలో నీరు విడుదల చేయాల్సి ఉండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మరో రెండు నెలల పాటు వర్షాలు కురిసే అవకాశం లేదు. కనీసం జూన్ వరకైనా అందుబాటులో ఉన్ననీటినే పొదుపుగా వాడుకుంటే, తర్వాత వర్షాలు కురిసి నీటి ఇబ్బందులు తొలుగుతాయని అధికారులు భావిస్తున్నారు.

వైభవంగా అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం

దండేపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం శబరి మల అయ్యప్పస్వామి మందిరంలో ఉత్తర నక్షత్ర సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాకులు, గురుస్వామి శ్రీ చక్రవర్తుల పురుషోత్తమచార్యులు వైభవంగా నిర్వహిచారు. అయ్యప్పస్వామి ఉత్తర నక్షత్ర, పంచామృతాభిషేకం పుష్పభిషేకం, ఉత్తర కవచం పారాయణ ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఆలయ అర్చకులు వందలాది మంది భక్తుల నడుమ జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కాసిపేట, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రత్నం ప్రదీప్ అన్నారు. శుక్రవారం దేవాపూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్పు చేసి ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచేందుకు కుట్రలు పన్నుతుంది కాబట్టి రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి కార్యకర్త కంకణబద్ధులై పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమిష్టిగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలేటి స్వామి, ముత్యాల రాజమౌళి, శంకర్, పురుషోత్తం పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్

దండేపల్లి,ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. గావ్ ఛలో బస్తీ ఛలో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దండేపల్లి మండలం చింతపల్లి గ్రామంలోని పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ముందుగా పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ, రైతు భరోసా అందక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు రాజయ్య, మహిళ విభాగం అధ్యక్షురాలు అక్కల దివ్య, నాయకులు కిషన్, గురువయ్య, సంతోష్, కిషన్, వెంకటేష్, నరేష్, పాల్గొన్నారు.

నెన్నెలలో బీజేపీ గావ్ చలో కార్యక్రమం

నెన్నెల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపడుతున్న గావ్ చలో కార్యక్రమాన్ని శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించారు. స్థానిక హనుమాన్, గంగాధర దేవాలయాలను దర్శించుకొని, వాటిని శుద్ధి చేశారు. గ్రామంలో పర్యటించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గూర్చి వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ, మాజీ మండల అధ్యక్షులు శైలెందర్‌సింగ్, నాయకులు కోట వంశీ, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి

దండేపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్ శుక్రవారం ఓప్రకటనలో కోరారు. పాఠశాలకు ఒంటిపూట బడి ఉండటం, సెలవులు సమీపిస్తుండడంతో గోదావరి, చెరువుల్లో పిల్లలు ఈతకు వెళ్లి ప్రమాదం బారిన పడకుండా చూడాలన్నారు.

కోటపల్లి : వేసవి కాలంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలం కావడంతో ప్రస్తుతం పాఠశాలలకు సెలవులు సమీపిస్తుండగా మండలంలోని పలు గ్రామాలు గోదావరి, ప్రాణహిత పరివాహక ప్రాంతంలో ఉన్నాయని, పిల్లలు సమీపంలోని గోదావరి, ప్రాణహిత, వ్యవసాయ బావుల్లో స్నేహితులతో ఈతకు వెళ్లే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు పిల్లలపై దృష్టిపెట్టాలని కోరారు.

నేడు ఆలయంలో ప్రత్యేక పూజలు

మందమర్రిరూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సారంగపల్లి గ్రామంలోని దుబ్బపల్లిలో హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ పూజారి స త్యనారాయణ తెలపారు. ఉదయం సత్యనారాయణ స్వామి వ్రతం, హోమం, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కులాలకు అతీతంగా రాజీవ్ యువ వికాసం

జైపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కులాలకు, మతాలకు అతీ తంగా రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రవేశపెట్టిందని ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఐకేపీ కార్యా లయంలో మహిళలకు రాజీవ్ యువ వికాస పథకంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 వరకు ఈ పథకానికి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు 180 రకాల వ్యాపారాలకు ఆర్థిక సహాయం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందని మహిళలకు సూచించారు. ఈ అవకశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీసీఎస్‌లు, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

చెన్నూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఆస్నాద, ఎర్రగుంటపల్లి గ్రామాల్లో ఏవో యామిని శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్ ఫాం సాగు, సేంద్రీయ వ్యవసాయ విధానం, వరిలో నాణ్యత ప్రమాణాల గురించి వివరించారు. ఏఈవో సాగర్, పంచాయతీ కార్యదర్శి శ్వేత, ఆయిల్‌ఫాం మండల కో ఆర్డినేటర్ అరుణ్, రైతులు పాల్గొన్నారు.

టీకాల కార్యక్రమంపై అవగాహన

గర్మిళ్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ టీకాల కార్యక్రమంపై డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్పెషల్ క్యాచ్ అప్ టీకాల కార్యక్రమం ఏప్రిల్, మే, జూన్ నెలలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో వంద శాతం టీకాలు అందజేయాలని ఎవరైనా సమయంలో టీకాలు తీసుకోకుంటే టీకాలు పూర్తిస్థాయిలో వేయాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో టీకాలు తప్పిపోయిన పిల్లలను గుర్తించి టీకాలను వేయాలన్నారు. పిల్లల ఇమ్యూనిటీ పవర్ పెంచడానికి వ్యాధుల నియంత్రణకు వ్యాక్సినేషన్ ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతి గ్రామంలో రద్దీ ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత

భీమిని, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : భీమినిలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ భూ సమస్యను పరిష్కరించి అర్హులైన వారికి రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పెద్దగుడిపేట శివారులోని సర్వే నంబరు 121లో 2.35 గుంటల భూమి పోచయ్య పేరున ఉండగా చిన్నగుడిపేటకు చెందిన సోమటెంకి పోచయ్య, దుర్గం మొండి, దుర్గం బాపులు భూమి తమదని కోర్టుకు వెళ్లారు. ఈ క్రమంలో భూమిని ముర్కి గట్టయ్యకు ఇరు వర్గాలు రూ. 15 లక్షలకు నాలుగేళ్ల క్రితం విక్రయించారు. కానీ రిజిస్ట్రేషన్ చేయలేదని, దీంతో గట్టయ్య తహసీల్దార్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భీమిని తహసీల్దార్ కర్ణదాస్, ఎస్‌ఐ విజయ్‌కుమార్, ఆర్‌ఐ వెంకటేశం ఇరు వర్గాలను ఒప్పించడంతో కొనుగోలు దారుడు ముర్కి గట్టయ్య భార్య ముర్కి మల్లక్క పేరు మీద భూమి రిజిస్ట్రేషన్ చేసి పట్టాలను అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.



కొనుగోలు దారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి

దండేపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఒక సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల ఏర్పాటు చేసి నేరస్థులను సులభంగా కట్టడి చేయవచ్చునని దండేపల్లి ఎస్సై ఎండి తహసీనోద్దీన్ దాత లింగాల శ్రీమతి అన్నారు. దండేపల్లి మండలం మేదరిపేట బస్టాండ్ వద్ద వ్యాపారస్థులు, దాతలు సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, వాడ వాడల మైకెసెట్ల కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాపారస్థులు ఎల్లూరి వేణు, చొప్పదండి రమేష్, మాదంశెట్టి మల్లిఖార్జున్ ఉన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి



మంచిర్యాలలో పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు



నస్పూర్‌లో బీఆర్ఎస్ కార్యాలయం ఎదుట పూలే చిత్ర పటం వద్ద నాయకులు



మందమర్రిలో పూలే జయంతి వేడుకల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో మహాత్మాజ్యోతిబా పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు తుల మధుసూదన్‌రావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నస్పూర్: నస్పూర్ కాలనీ బీఆర్ఎస్ పట్టణ కార్యాలయం వద్ద శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూ లే జయంతిని నాయకులు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పాల్గొన్నారు.

గర్మిళ్ల: మంచిర్యాలలో టీఎన్‌జీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొని పూలేకు నివాళులర్పించారు.

●తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో పూలేకు నివాళులర్పించారు.

●జిల్లా కేంద్రంలోని సాయికుంట బీసీ బాలుర సమీకృత వసతి గృహంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకు లు పూలేకు నివాళులర్పించారు.

జన్నారం : మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ నర్సయ్య పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జైపూర్ : బీసీ సంఘం మండల అధ్యక్షుడు వేముల మల్లేష్ పూలేకు నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

కోటపల్లి : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ప్రత్యేకాధికారిణి హరిత ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే, కస్తూర్బాగాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

జైపూర్ : జైపూర్‌లోని ఎస్టీపీపీలో ముఖ్య అతిథి గా ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి హాజరై పూలే చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బెల్లంపల్లి: పట్టణంలో బహుజన్ సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టీఎస్‌యు టీఎఫ్‌తో పాటు పాఠశాలల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో, పట్టణంలోని పలు వార్డుల్లో నాయకులు అధికారులు జ్యోతిబాపూలే జయంతి వేడుకలను నిర్వహించారు.

జన్నారం : మండలంలోని పొనకల్ రామాలయం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చెన్నూరు: చెన్నూరు పట్టణంలో వివిధ సంఘాల నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లక్సెట్టిపేట: పట్టణంలోని పాత బస్టాండ్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీసీ సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను శుక్రవారం సభ్యులు నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఇటిక్యాలలో నివాళులు అర్పించారు.

మందమర్రిటౌన్ : విద్యా వ్యాప్తికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిబాపూలే అని మందమర్రి జీఎం దేవేందర్ పేర్కొన్నారు. పట్టణంలోని సింగరేణి గ్రీన్ పార్కు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద నిర్వహించిన పూలే జయంతిని ఆయన హాజరై నివాళులర్పించారు.

●పట్టణంలోని సింగరేణి పాఠశాల ,మనోవికాస్ మానసిక దివ్యాంగుల పాఠశాల వద్ద మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

●పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఆవరణలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఐ రాజశేఖర్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు.

●పట్టణంలోని రాష్ట్రీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు.

కన్నెపల్లి : మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద పూలే చిత్రపటానికి బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింగ్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూలే దంపతుల విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ చేశారు.

సంక్షిప్త సమాచారం

కోటపల్లి : మండలంలోని రొయ్యలపల్లి గ్రామంలో గురువారం రాత్రి కోటపల్లి పోలీసుల ఆధ్వర్యంలో కళాబృందం సభ్యులతో కళాజాత నిర్వహించారు. సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు, డయల్ 100 ప్రాముఖ్యత, గంజాయి నిరోధం, సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ రాజేందర్, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

●మండలంలోని సిర్సా గ్రామంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో గావ్ ఛలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు పెద్దింటి పున్నంచంద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద స్వచ్ఛ భారత్ చేపట్టారు.

తాండూర్ : మండలంలోని గోపాలరావుపేట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను శుక్రవారం మాజీ మార్కెట్ చైర్‌పర్సన్ గట్టు మురళీధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ కిరణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వసంత పాల్గొన్నారు.

వేమనపల్లి : వేమనపల్లి మండల కేంద్రంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గావ్ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే హనుమాన్ ఆలయంలో శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. నాయకులు బాపు, వెంకటేష్, శ్రీకాంత్, పుల్లయ్య, అంజన్న పాల్గొన్నారు.

భీమారం : భీమారం నుంచి లంబాడి తండాకు అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను శుక్రవారం పట్టుకున్నట్లు భీమారం ఎస్‌ఐ శ్వేత తెలిపారు.

లంబాడితండాకు చెందిన బానోత్ రాజేందర్ అనే వ్యక్తి గుడుంబా తరలిస్తుండగా ఆర్కేపల్లి కెనాల్ వద్ద పట్టుకుని అతని వద్ద నుంచి 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు చోట్ల శుక్రవారం చలివేంద్రాలను ప్రారంభించారు. కాగజ్‌నగర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం డీఎస్పీ రామానుజం ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ వేసవిలో పట్టణానికి వచ్చే ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చిలువేరు సత్యనారాయణ, రాచకొండ గిరిష్, సంతోష్, పట్టణ అధ్యక్షులు శంకరయ్య పాల్గొన్నారు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కుమరం భీం చౌరస్తాలో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చలివేంద్రాన్ని సీఐ బుద్దె స్వామి ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ పోలీసులు ప్రజల సేవ కోసమే పని చేస్తున్నారని అన్నారు. వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, నాయకులు వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఏఎస్సై నారాయణగౌడ్, కానిస్టేబుళ్లు ప్రభాకర్, శంకర్, శ్రీనివాస్, ఆటో డ్రైవర్ సంఘం అధ్యక్షుడు మల్లేష్, లింగమూర్తిగౌడ్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై నరేష్ అన్నారు. మండలంలోని రవీంద్రనగర్-1 గ్రామంలో గంగాపూర్ మాజీ ఎంపీటీసీ రోజా సుధాకర్ ఆధ్వర్యంలో వారి మాతృమూర్తి రుషక్క జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేయగా ఎస్సై శుక్రవారం ప్రారంభించారు కార్యక్రమంలో నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యంపై నిఘా

జిల్లాలో రేషన్ దుకాణాల ద్వారా అందజేస్తున్న సన్న బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తరుచూ తనిఖీ చేస్తూ అక్రమాలకు పాల్పడకుండా నిఘా కొనసాగిస్తున్నారు.


రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి(ఫైల్)

- పక్కదారి పట్టకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు
- రోజువారి తనిఖీలు, నివేదికలు
- ఆసక్తి చూపుతున్న లబ్ధిదారులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఉగాది కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల నుంచి రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీని ప్రారంభించింది. దీంతో రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. ఇదే సమయంలో బియ్యం పక్కదారి పట్టకుండా దొడ్డు బియ్యాన్ని కలపకుండా ప్రజా పంపిణీ వ్యవస్థపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అక్రమాలకు చోటు లేకుండా ప్రక్షాళన చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను రంగంలోకి దింపింది. జిల్లా వ్యాప్తంగా నిరంతరం ఎక్కడో ఒకచోట రేషన్ బియ్యం పట్టుబడుతునే ఉన్నాయి. కొన్ని రేషన్ దుకాణాలు అక్రమాలకు నిలయంగా మారాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ తరుణంలో ఏప్రిల్ 1 నుంచి సన్న బియ్యం పంపిణీని ప్రభుత్వం ప్రారంభించింది. గతానికి భిన్నంగా టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను సమాయత్తం చేసి దుకాణాల్లో అక్రమాలకు తెరపడేలా పౌరసరఫరాల అధికార యంత్రాంగం పటిష్ట నిఘా కొనసాగిస్తోంది.

● అక్రమ దందాకు..

ఇన్నాళ్లు రేషన్ దుకాణాల అడ్డాగా జరిగిన బియ్యం అక్రమ దందాకు సన్నబియ్యం పంపిణీతో అడ్డుకట్ట పడింది. అక్రమ వ్యాపారం కొనసాగించే వ్యక్తులు జిల్లా వ్యాప్తంగా పాత పద్ధతి ప్రకారం రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి సన్నబియ్యం ఎలా ఉన్నాయి. వాటిని అమ్ముతారా అంటూ ఆరా తీస్తున్నారు. దొడ్డు బియ్యం కంటే కిలోకి ఐదు రూపాయలు ఎక్కువగా ఇస్తామంటూ బేరసారాలు ఆడుతున్నారు. కొందరు డీలర్లు సైతం డబ్బులు కావాలా లేక బియ్యం కావాలా అంటూ లబ్ధిదారులను అడుగుతున్నారని చెబుతున్నారు. కొందరు అక్రమ బియ్యం వ్యాపారులు లబ్ధిదారుల ఇళ్ల దగ్గరకు వెళ్లి కిలోకి 20 రూ పాయలు చెల్లిస్తామని మభ్యపెడుతున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంపై సివిల్ సప్లయ్ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో బియ్యం వ్యాపారుల కదలికలపై కన్నేసింది.

● లబ్ధిదారుల ఆసక్తి..

రేషన్ దుకాణాల్లో ఈ నెల నుంచి పంపిణీ చేసే సన్న బియ్యం తీసుకునేందుకు లబ్ధిదా రులు ఆసక్తి చూపుతున్నారు. ఇన్నాళ్లు దొడ్డు బియ్యం సరఫరా చేయడంతో లబ్ధిదారులు తినేందుకు ఇష్టపడేవారు కాదు. దీంతో ఇలా రేషన్ దుకాణాల్లో కొనుగోలు చేసి బయటికి రాగానే ఇతర వ్యాపారులకు విక్రయించేవారు. కొందరు అదే డీలర్ ఏర్పాటు చేసిన వ్యక్తికి విక్రయించేవారు. అలా ఈ బియ్యం మిల్లులకు చేరవేసి రీసైక్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి లేదా పక్కన ఉన్న మహారాష్ట్రకు తరలించేవారు.

ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వా రా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీంతో లబ్ధిదారులు ఎన్నడు లేని విధంగా సన్నబియ్యం తీసు కువెళ్లేందుకు పోటీ పడుతున్నారు. దీంతో ఒక్కో రేషన్ దుకాణంలో కేవలం వారం రోజుల వ్యవధిలోనే బియ్యం కోటా ఖాళీ అవుతున్నాయి. జిల్లాలో ఏప్రిల్ నెలకు సం బంధించి 314 రేషన్ దుకాణాల్లో 1,39,795 రేషన్‌కా ర్డుల లబ్ధిదారులకు 3008.000 మెట్రిక్ టన్నుల సన్నబి య్యం కేటాయించామని అధికారులు చెబుతున్నారు.

> **పక్కదారి పడితే చర్యలు..**
>
> **- వినోద్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి**
>
> బియ్యం పక్కదారి పడితే చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని మొత్తం రేషన్ దుకాణాలకు 3008.000 మె ట్రిక్ టన్నుల సన్నబియ్యం అందించాం. కలెక్టర్ ఆదేశా లతో ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులతో రేషన్ దుకాణాలపై నిఘా కొనసాగిస్తున్నాం. అక్రమాలకు పాల్పడినా, లబ్ధిదారులకు సరైన సేవలు అందించక పోయినా డీలర్లపై చర్యలు తీసుకుంటాం.

వంద రోజుల పాటు పని కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

వాంకిడి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ప్రతీ కుటుంబానికి వంద రోజుల పాటు పని కల్పించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కార్యద ర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వమించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని చెప్పారు. ఇంకు గుంతలు అవసరం ఉన్న వారికి మంజూరు చేయాలని తెలిపారు. నర్సరీలను మొక్కలు పెరుగుదల సరిగ్గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, ఎంపీవో ఖాజా అజీజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అవగాహన ర్యాలీ


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మున్సిపల్‌లోని జన్కాపూర్‌లో శుక్రవారం జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో చరణ్, అసద్, వసం త్‌రావు, ఖలీం, బాలేష్ గౌడ్, మల్లేష్, తారీక్, భీంరావు, జావీద్, అబ్బా, జమీర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ పక్వాడ'

దహెగాం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం ఇట్యాల, దహెగాం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పార్వతి, పద్మ, మమత, రమ, సమీనాబేగం, ఆయాలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

లింగాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జైనూర్ డిప్యూటీ రేంజ్ ఆదికారి జ్ఞానేశ్వర్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని శుక్రవారం కొత్తపల్లి గ్రామస్థులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ ఆత్మారామ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాదవ్ లోకేందర్ మాట్లాడారు.

రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటో ఏర్పాటు చేయాలి

రెబ్బెన, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటో ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. బీజేపీ మండల శాఖ నాయకులు శుక్రవారం తహసీల్దార్ రాంమోహన్ రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాంబాబు, మండల కన్వీనర్ మల్లేష్, కో కన్వీనర్ సతీష్, ముంజల వెంకన్న, రాజేష్, శంకర్ పాల్గొన్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ గాంధీనగర్‌లో ఐదు నెలల క్రితం జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. స్థానికంగా శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ వివరాలు వెల్లడించారు. ఐదు నెలల క్రితం గాంధీనగర్‌లో ఓ స్కూటీ (టీఎస్20బీ5655) చోరీకి గురైందన్నారు. ఫిర్యాదు మేరకు చోరీపై నిఘా పెట్టగా ఇద్ద రు మైనర్లు తీసుకెళ్లినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సమావేశంలో క్రైం కానిస్టేబుళ్లు రాజు, నాగరాజు పాల్గొన్నారు.

యూనిఫామ్ కొలతలు సేకరణ

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ఏప్రిల్ 24 నుంచి ప్రారంభం కానుండడంతో పాఠశాల యూనిఫామ్ కోసం విద్యార్థుల నుంచి కొలతలు తీసుకుంటున్నారు. వేసవి సెలవుల్లో యూనిఫాంలు కుట్టడం పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. జూన్ 12న కచ్చితంగా అందరికి యూనిఫాం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంఈవో సుభాష్ తెలిపారు. కొలతలు పూర్తి కాని పాఠశాలలు ఉంటే సంబంధిత విద్యాధికారికి తెలియజేయాలని సూచించారు.

కాంగ్రెస్ మండల కన్వీనర్‌గా భీమన్న

దహెగాం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ దహెగాం మండల కన్వీనర్‌గా పోతుగంటి భీమన్నను డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ నియమించారు. ఈ సందర్భంగా భీమన్న మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ జడ్పీటీసీ శ్రీరామరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

జ్యోతిబాపూలే ఆశయాలను కొనసాగిద్దాం

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే
- జిల్లా వ్యాప్తంగా పూలే చిత్రపటాల వద్ద నివాళులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల దళిత, గిరిజన ప్రజల సంక్షేమం కోసం అంకిత భావంతో కృషి చేసిన మహనీయుడు జ్యోతిబాపూలే ఆశయాలను కొనసాగిద్దామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పూలే జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాలీ సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు, బలహీన, దళిత, గిరిజన ప్రజల సంక్షేమం, స్త్రీ, పురుష సమాన త్వం కోసం తమ జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జ్యోతిబా పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి సజీవన్, మాజీ జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, నాయకులు శ్యాంనాయక్, పీఏసీఎస్ అలీబీన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): జ్యోతిబాపూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు అన్నారు. కాగజ్‌నగర్‌లో జ్యోతిబాపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు త్రివేణి, శ్రీకాంత్, బాలకిషన్, కృష్ణమాచారితదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు సంఘాల నాయకులు జ్యోతిబాపూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్‌కార్, మాలీ సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గుర్నులే నారాయణ, ఏఎస్సై పోషెట్టి, వివిధ సంఘాల నాయకులు జైరాం ఉప్రె, హంసరాజ్, విలాస్, ప్రశాంత్, బి. జైరాం, దాదాజీ, కృష్ణ పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు సావర్‌ఖేడ గోయగాం, రింగన్ ఘాట్, సాంగ్వి, కేలి(బి), ఇందాపూర్, నిశాని గ్రామాల్లో జ్యోతిబాపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలో మాలీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు తులసీరాం, శ్యాంరావు, మాజీ ఎంపీపీ మోతిరాం తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇట్యాల గ్రామంలో మాలీ కులస్తులు జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. మాలీ సంఘం గ్రామాధ్యక్షుడు భీంరావు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగేష్, తిరుపతి, భీమయ్య, శంకరి, బండు, నాగేందర్, నారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జ్యోతిబాపూలే జయంతిని బీజేపీ పార్టీ, మాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాలి సంఘం నాయకులు రామకృష్ణ, అశోక్, భీమన్న, సురేష్, మోహన్, శంకర్, గోపాల్, తిరుపతి, కె.తిరుపతి, రాకేష్, దిగంబర్, రాజారాం, సంతోష్, శ్యాంసుందర్, శంకర్, మోహన్, నీలేష్, తిరుపతి పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో జ్యోతిబాపూలే విగ్రహానికి మాలీ సంఘం నాయకులు పూల మాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వసంత్‌రావు, గంగారాం, నాందేవ్, బాపూరావు, విజయ్, రాము, పాండురంగ్, మొండి, శంకర్, వేణు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్‌లో నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి


బెజ్జూరులో నివాళులు అర్పిస్తున్న నాయకులు

మహంకాళీ జాతరకు ఏర్పాట్లు పూర్తి


ముస్తాబు చేసిన మహంకాళీ ఆలయం

రెబ్బెన, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలో కొలువైన శ్రీ కనకదుర్గా దేవి స్వయంభూ మహంకాళీ అమ్మవారి ఆలయాన్ని జాతరకు ముస్తాబు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం, ఆదివారం జాతర నిర్వహించనున్నారు. అమ్మ వారు వెలసిన రోజును పురస్కరించుకొని రెండు రోజుల పాటు జాతర నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తల్తెకుండా బ్యారికెడ్లు ఏర్పాట్లు చేశారు. తాగునీటి వసతి కూడా కల్పించారు. జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. జాతరలో భాగంగా శనివారం చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. ఆదివారం అమ్మవారి వెలిసిన రోజు సందర్భంగా బోనాలు సమర్పణ, బలిదానాలు ఇచ్చి సామూహిక భోజనాలు చేస్తారు. పుట్ట వద్ద ముడుపులు కడతారు.

వరంగల్ సభకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలి

సిర్పూర్(టి), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆ పార్టీ నాయ కులు అస్లాంబీన్ అబ్దుల్లా కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో కార్యాక్రమానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, పాల్గొన్నారు.

కేస్లాపూర్ హనుమాన్ ఆలయం ముస్తాబు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని పెద్దవాగు నది తీరాన ఉన్న కేస్లాపూర్ ఆంజనేయ స్వామి ఆలయాన్ని జయంతి వేడుకలకు ముస్తాబు చేస్తున్నారు. శనివారం హనుమాన్ చిన్నజయంతి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లను పూర్తి చేసింది. ఆలయ సమీపంలోని స్థలాన్ని చదును చేశారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఆలయ స్థలంలో..

గోండు రాజు (అంకమరాజు) కాలంలో వీరాంజనేయ స్వామి ఆలయం ఉన్న స్థలంలో పూర్వం కేస్లాపూర్ గ్రామం ఉండేది. గోండు జాతికి చెందిన ప్రజలు ఆంజనేయ స్వామిని భక్తి శ్రద్ధలతో పూజిస్తుండే వారు. నిజాం పాలనలో గ్రామ ప్రజలు ఊరి విడిచి వెళ్లడంతో గ్రామంతో పాటు ఆంజనేయ స్వామి ఆలయం కాలగర్భంలో కలిసి పోయింది. కాలక్రమంలో ఈ ఆలయ సమీపంలో పెద్దవాగుపై ఉన్న పురాతన వంతెన వరద ఉధృతికి కొట్టుకు పోయింది. దీనిన్న పునరుద్ధరించేందుకు ప్రభుత్వం పూనుకుంది. ఐదు దశాబ్దాల క్రితం ఈ వంతెన నిర్మాణం మొదలైంది. నిర్మాణంలో పిల్లర్లు ఎంత ప్రయత్నించినా నిలబడకుండా కొట్టుకుపోసాగాయి. ఈ పరిస్థితుల్లో ఓ రోజున రాత్రి ఆంజనేయ స్వామి సదరు కాంట్రాక్టర్‌కు కలలో ప్రత్యక్షమై నది ఒడ్డున ఆలయాన్ని నిర్మించి తనను పునర్ ప్రతిష్ఠాపించినట్లయితే ఈ వంతెన నిర్మాణ పనులు సజావుగా సాగుతాయని చెప్పారు. దీంతో ఆ కాంట్రాక్టర్ ఇక్కడ వీరాంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ నాటి నుంచి కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయానికి దినదినంగా భక్తుల తాకిడి పెరిగింది. ఆలయ పునరుద్ధరణతో పాటు భక్తుల సౌకర్యార్థం వసతి గదుల నిర్మాణం, భోజన శాల నిర్మాణం, తాగునీటి వసతి ఏర్పాట్లు చేశారు. ఆలయ ముఖద్వారం వద్ద రూ.8 లక్షల వ్యయంతో 41 అడుగుల ఎత్తుతో అభయాంజనేయ స్వామి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్- నాగ్‌పూర్ అంతరాష్ట్ర రహదారి పక్కన 41 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో ఆలయానికే కొత్త శోభ వచ్చింది. హనుమాన్ మాలధారులు ఆలయంలోనే 41 రోజుల పాటు పూజలు నిర్వహిస్తారు. నిత్య అన్నదానం, భక్తి కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంటుంది.



ముస్తాబు చేసిన కేస్లాపూర్ హనుమాన్ ఆలయం

ఉదయం నుంచే..

ఆలయంలో ఉదయం ఐదు గంటల నుంచి ప్రత్యేక పూజలను ఆలయ కమిటీ నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత్ సేవ, 5.30 కలశ గణపతి పూజ, స్వస్తి పుణ్యాహావాచనం, అఖండ దీపారాధన నిర్వహిస్తారు. 6 గంటలకు ధ్వజారోహణము, 6.30 గంటలకు నవగ్రహ స్థాపన, పూజ, 7.30 గంటలకు శ్రీ ఆంజనేయ స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 8.30 గంటలకు సహస్ర తమలాపత్ర, సహస్ర ఫల పుష్పార్చన, 9 గంటలకు నవగ్రహ, పురుషసూక్త, లక్ష్మీసూక్త, మన్యుసూక్త హవనము, పూర్ణాహుతి, బలిహరణము, 10 గంటలకు మంగళహారతి, మహామంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ, మహాదాశీర్వచనం, 10 గంటల నుంచి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.